## బీజేపీ, కాంగ్రెస్‌కు డిపాజిట్ గల్లంతే..



బల్వంతాపూర్‌లో బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

దుబ్బాక, నవంబర్ 27: దుబ్బాకలో బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందుతారని బీఆర్ఎస్ దుబ్బాక మండల పరిశీలకుడు ఎల్లు రవీందర్‌రెడ్డి, దుబ్బాక జడ్పీటీసీ కడతల రవీందర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సోమవారం దుబ్బాక మండలం పెద్ద చీకోడు, బల్వంతాపూర్ గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కే ప్రజల మద్దతు సంపూర్ణంగా ఉన్నదన్నారు. ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి ఘన విజయం ఖాయమన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలంతా కోరుకుంటున్నారని తెలిపారు. ఎవ్వరిని అడిగినా మా ఓటు కారు గుర్తుకు, కేసీఆర్ సర్కారుకే అంటున్నారని చెప్పారు. దుబ్బాక అభివృద్ధి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డితోనే సాధ్యపడుతుందని పేర్కొన్నారు. మెదక్ ఎంపీగా ఉన్నా దుబ్బాక ఎమ్మెల్యేగా పోటీ చేయటం నియోజకవర్గ ప్రజల అదృష్టమని తెలిపారు. దుబ్బాకలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ఆదరణ లేదని, బీజేపీ ఝూటా పార్టీ అని, కాంగ్రెస్ అంటే కరెంట్ కష్టాలని ప్రజలకు తెలిసిపోయిందన్నారు. ప్రతిపక్షాలకు పదవి దాహం తప్ప ప్రజల సమస్యలు పట్టవని ఆరోపించారు. ఎమ్మెల్యే రఘునందన్‌రావుతో దుబ్బాక మూడేండ్లు అభివృద్ధిలో వెనుకడుగు వేసిందన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ వెంటే నియోజకవర్గ ప్రజలు ఉన్నారని తెలిపారు. దుబ్బాకలో బీజేపీ, కాంగ్రెస్ మోసాలకు ప్రజలు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ తౌడ శ్రీనివాస్ , నాయకులు కొంగరి రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

## దుబ్బాకలో బీజేపీని ఓడించాలి

**సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్కా రాములు**



మాట్లాడుతున్న సభ్యుడు చుక్కా రాములు

దుబ్బాక టౌన్, నవంబర్ 27: మతతత్వ పార్టీ బీజేపీని ఓడించి ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్కా రాములు అన్నారు. దుబ్బాకలో సోమవారం సీపీఎం విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి చుక్కా రాములు హాజరై మాట్లాడారు. దుబ్బాక ఉపఎన్నికలో బీఆర్ఎస్‌పై స్వల్ప అధిక్యంతో గెలిచిన బీజేపీకి ఈసారి అవకాశం ఇవ్వద్దని కోరారు. అప్పుడే ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడిన వారమవుతామన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు విద్యుత్, విద్య, వైద్యం, రైల్వే, బ్యాంకింగ్, ఎయిర్‌పోర్టులు, ఖనిజ నిక్షేపాలు, గనులు, ప్రైవేట్, కార్పొరేట్ సంస్థలైన అంబానీలు, అదానీలకు దోచిపెట్టుతున్నారని ఆరోపించారు. గుజరాత్‌లో రేపిస్టులను విడుదల చేసి సన్మానాలు చేసిన దుర్మార్గమైన పార్టీ బీజేపీ అని మండిపడ్డారు. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను సైతం హరించివేస్తారన్నారు. కార్మిక చట్టాలన్నింటినీ రద్దు చేయడం, రైతులకు వ్యతిరేకంగా చట్టాలు చేయడం ప్రజలపై భారం మోపే విధంగా ధరలు పెంచడం బీజేపీకి అలవాటైందన్నారు. ఆదివాసీలపైన, మైనార్టీలపైనా, తినే తిండిపైనా, వేసుకునే బట్టలపైనా ఆంక్షలు విధించి దాడులు జరుగుతున్నాయన్నారు. దుబ్బాక నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజలు, కార్మికులు, రైతులు, నిరుద్యోగులు బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గోపాలస్వామి, జి.భాస్కర్, జిల్లా కార్యవర్గ సభ్యురాలు సింగిరెడ్డి నవీన, నాయకులు సాధిక్, కొంపెల్లి భాస్కర్, రాజు, ప్రశాంత్, మల్లేశం, మహేశ్, క్రాంతి, సాజిద్, ఎల్లయ్య, స్వామి తదితరులు పాల్గొన్నారు.

# ప్రాణమున్నంత వరకు ప్రజా సేవకే అంకితం



తిమ్మక్కపల్లిలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న కొత్త ప్రభాకర్‌రెడ్డి



బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డికి నుదుట తిలకం దిద్దుతున్న మహిళ

- కాంగ్రెస్, బీజేపీకి ఓట్లు వేస్తే ఆగమవుతాం
- కత్తి పోట్లకు ఓట్లతో గుణపాఠం చెప్పాలి
- రాజకీయంగా ఎదురుకోలేక దాడి చేశారు
- దుబ్బాక ప్రజల దీవెనలతో బతికి బయట పడ్డా
- మళ్లీ రాష్ట్రంలో బీఆర్ఎస్‌దే అధికారం
- సీఎం కేసీఆర్‌తో నియోజకవర్గాన్ని అదర్శంగా తీర్చిదిద్దుతా..
- దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి

రాయపోల్, నవంబర్ 27: 'గొంతులో ప్రాణం ఉన్నంత వరకు దుబ్బాక ప్రజలకు సేవ చేస్తా.. ధర్మం, న్యాయం ఎప్పుడూ గెలుస్తాయి. రాజకీయంగా ఎదుర్కోలేకే నాపై కత్తితో దాడి చేశారు. దుబ్బాక ప్రజల దీవెనలతో బతికి బయటపడ్డా.. కత్తి పోటుకు ప్రజలు ఓట్లతో వారికి గుణపాఠం చెప్పాలి.' అని బీఆర్ఎస్ దుబ్బాక అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన ఎన్నికల ప్రచారంలో భాగంగా రాయపోల్ మండలంలోని తిమ్మక్కపల్లి, రాయపోల్ మండల కేంద్రంలో ప్రచారం చేపట్టారు. ప్రజలు ఆగం కావొద్దని కాంగ్రెస్, బీజేపీలకు ఓట్లు వేస్తే రాష్ట్ర అంధకారం అవుతుందన్నారు. పేదలకు సీఎం కేసీఆర్ ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి అమలు చేశారని, ప్రజలు కుడా కారుగుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. తనపై దాడి జరిగినా కార్యర్తలు ఊరూరా ఇంటింటి ప్రచారం చేశారన్నారు. గత ప్రభుత్వాల హయాంలో సాగునీరు లేక రైతులు ఎందరో ఆత్మహత్య చేసుకున్నారన్నారు. సీఎం కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టుతో బీడు భూములకు సైతం సస్యశ్యామలం చేశారన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రాజెక్టులు నిర్మించని పార్టీలకు ఓట్లు అడిగె హక్కు లేదన్నారు. కాళేశ్వరం, మల్లన్నసాగర్ ప్రాజెక్టుతో నియోజకవర్గం మరో కోనసీమగా మరుతుందని చెప్పారు. అధికార దాహంతో ఓట్లు దండుకోవడానికి ప్రతిపక్షాలు మాయమాటలతో గ్రామాల్లోకి వస్తున్నారని, ప్రజలు వారిని నమ్మొద్దని సూచించారు. బీఆర్ఎస్‌కు ప్రజలు స్వచ్ఛందంగా మద్దతు ప్రకటించడం అభినందనీయమన్నారు. కార్యక్రంలో జడ్పీటీసీ యాదగిరి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఇప్ప లక్ష్మి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మామిడి మోహన్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర శర్మ, బీఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకులు రాజిరెడ్డి, ఇప్ప దయాకర్, తిమ్మక్కపల్లి సర్పంచ్ నిర్మలారాజిరెడ్డి, రాయపోల్ సర్పంచ్ మౌనిక, మజీ ఏఎంపీ చైర్మన్ పడకంటి శ్రీను, రైతు సమితి అధ్యక్షుడు నర్సింహారెడ్డి, మహిళా నాయకురాలు బాలక్ష్మి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కార్తిక పౌర్ణమి పూజలో శ్రీనిత

సిద్దిపేట కమాన్, నవంబర్ 27: కార్తిక పౌర్ణమిని పురస్కరించుకొని మంత్రి తన్నీరు హరీశ్‌రావు సతీమణి శ్రీనిత పట్టణంలోని పలు ఆలయాల్లో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దీపాలు వెలిగించి పూజల్లో పాల్గొన్నారు. సిద్దిపేటలోని మంత్రి నివాసంలో దీపాలు వెలిగించి పటాకులు కాల్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులారాజనర్సు, మహిళలు పాల్గొన్నారు.





నీలకంఠేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి హరీశ్‌రావు సతీమణి శ్రీనిత, దీపాలు వెలిగిస్తున్న దృశ్యం

# కొత్త ప్రభాకర్‌రెడ్డిని గెలిపించుకుందాం

**ఎంపీ ప్రభాకర్‌రెడ్డి సతీమణి మంజులత**

దుబ్బాక టౌన్, నవంబర్ 27: ఇప్పటికే బీజేపీ మాయమాటతో ఎంతో వెనుకబడ్డాం.. మరోసారి ఆగం కావద్దు, ఆలోచించండి. సీఎం కేసీఆర్‌కు దుబ్బాకపై ఎంతో ప్రేమ ఉంది. దుబ్బాకలో కొత్త ప్రభాకర్‌రెడ్డితోనే అభివృద్ధి సాధ్యం.. అని బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి సతీమణి మంజులత అన్నారు. సోమవారం దుబ్బాకలోని డబుల్‌బెడ్ రూం కాలనీలో జట్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత, బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు సోలిపేట సతీశ్‌రెడ్డితో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంజులత మాట్లాడుతూ.. నాడు అధ్వానంగా ఉన్న తెలంగాణను స్వరాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమంలో దేశానికే రోల్ మోడల్‌గా నిలిపిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు.



డబుల్‌బెడ్ రూం కాలనీలో ప్రచారం చేస్తున్న మంజులత, జట్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, గన్నె వనిత

బీఆర్ఎస్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రాగానే సీఎం కేసీఆర్ ప్రకటించిన మ్యానిఫెస్టోలోని పథకాలన్ని తప్పక అమలు అవుతాయన్నారు. ఈ గడ్డ మీద పుట్టిన కొత్త ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకోవలసిన అవసరం మనందరిపై ఉన్నదన్నారు. కొత్త ప్రభాకర్‌రెడ్డి నియోజకవర్గాన్ని శరవేగంగా అభివృద్ధి చేస్తాడని, అందుకు నియోజకవర్గంలోని ప్రజల దీవెనలు, ఆశీస్సులు కావాలన్నారు. ప్రభుత్వం ఏర్పడిన నెల రోజుల్లో దుబ్బాకను రెవెన్యూ డివిజన్ చేస్తానని సీఎం కేసీఆర్ దుబ్బాక సభలో ప్రకటించడంతోపాటు దుబ్బాక అభివృద్ధికి పెద్దఎత్తున నిధులు మంజూరు చేస్తాననడం హర్షణీయమన్నారు. కొత్త ప్రభాకర్‌రెడ్డికి ఘన విజయం అందించి సీఎం కేసీఆర్‌కు కానుకగా ఇవ్వాలన్నారు. ఓటరు బ్యాలెట్‌లో 1వ నంబర్ గుర్తును చూపించి కారు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లకు అవగాహన కల్పించారు. ప్రచారంలో కౌన్సిలర్లు నిమ్మ రజితా ఆయాదగిరి, ఆస సులోచనాస్వామి, లొంక రాజవ్వ, పులిగారి కల్పన ఎల్లం, ఎంగారి స్వప్న రాజిరెడ్డి, రాష్ట్ర నాయకుడు రొట్టె రాజమౌళి, నాయకులు ఆకుల రమేశ్, దేవేందర్, కొట్టె ఇందిర, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.